

# మనం


## మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

ఆదివారం । 26 । నవంబర్ । 2023 । పేజీలు : 9


# ఉషారైన ఓటరు

- అన్ని మీటింగ్‌లకు హాజరు
- పబ్లిక్‌ను చూసి స్టార్ క్యాంపెయినర్లు ఫిదా
- తడిసి మోపెడవుతున్న ఖర్చులు
- వస్తున్నారు ఒకే.. మరి ఓటెవరికి?

2 లో



# బిఆర్‌ఎస్‌లో కొరవడిన 'కొత్త'దనం

- కర్యకర్తల్లో నేటికీ చిగురించని 'కొత్త' ఆశలు
- ఇంకా ఎన్నేండ్లు సిద్దిపేటోళ్ల పెత్తనమంటూ చికాకు
- బీజేపి జోరు, కాంగ్రెస్ హోరుతో బిఆర్‌ఎస్ ఆగమాగం
- గెలుపు అవకాశాలు అంతంతమాత్రమే అంటున్న కిందిస్థాయి నేతలు


3 లో

## బిఆర్‌ఎస్ బిజేపిలు


# కవల పిల్లలే

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీల అమలు

దుబ్బాక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



దౌల్తాబాద్, నవంబర్ 25, మనం న్యూస్ః గరీబోళ్ల బతుకులు బాగుపడాలంటే కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి ఓటేయాలని దుబ్బాక కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలం శేరిపల్లి బందారం, ఉప్పరిపల్లి, గోవిందాపూర్, పోసాన్‌పల్లి, కోనాయిపల్లి, దీపాయంపల్లి, మిగతా 8లో..



## పబ్బు కావాలన్న వాడు

# ఆర్డీఓ కార్యాలయమెందుకు అడగలే

- దుబ్బాక అభివృద్ధికి ఆటంకం హరీష్‌రావే
- కూడవెల్లి రామలింగేశ్వరాలయం పర్యాటకంగా తీర్చిదిద్దుతాం
- రేషన్ కార్డులు ఇవ్వలేని కేసీఆర్ క్వాటర్ సీసాల లభ్యత పెంచాడు
- దుబ్బాక అసెంబ్లీ బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు

మిరుదొడ్డి, నవంబర్ 25, మనం న్యూస్ః సిద్దిపేటకు ఒక పబ్బు కావాలని అడిగిన ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాకకు ఒక ఆర్డీఓ కార్యాలయం కావాలని ఎందుకు అడగలేదన దుబ్బాక బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు ప్రశ్నించారు. శనివారం అక్బర్‌పేట భూంపల్లి మండల మిగతా 8లో..

# అభివృద్ధి చేసే కేసీఆరా...అబద్ధాల కాంగ్రెస్సా

- కాంగ్రెస్ వస్తే కుక్కలు చింపిన విస్తరే
- రాజకీయంలో ప్రత్యర్థులుండాలి ..శత్రువులు కాదు
- 80 సీట్లను మించి అధికారంలోకి వస్తాం
- ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- నా జీవితం హుస్నాబాద్ ప్రజలకే అంకితం
- హుస్నాబాద్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్ కుమార్

8 లో





# ఉషారైన ఓటరు

సిద్దిపేట, నవంబర్ 25, మనం న్యూస్ ప్రతినిధిః అప్పటి నుంచి ఇప్పటి వరకు అవసరానికి అనుగుణంగా పార్టీ కండువాలను చూసే నాయకులను చూశాం.. టిక్కెట్ ఆశించి భంగపడ్డవారో, నమ్ముకున్న పార్టీలో సరైన ప్రాధాన్యత దక్కడం లేదనో ఉన్న పార్టీలోనే ఇంకో లీడర్‌తో మనస్ఫర్థలో.. కారణాలేవైనా ఎన్నికలప్పుడు నాయకులు కండువాలు మారడం పరిపాటి. వార్డు మెంబర్ స్థాయి నుండి మొదలు మంత్రుల స్థాయి వరకు ఒక్కో రోజు రెండు, మూడు పార్టీలు మారిన వారినీ చూసాం. కాలానుగుణంగా సోషల్ మీడియా ఏ విధంగా అయితే ప్రజాప్రాబల్యంలోకి వచ్చిందో, ఇంటర్నెట్ స్పీడ్ ఏవిధంగా పెరిగిందో అందుకు అనుగుణంగానే ఓటర్ మైండ్‌సెట్ మారిందని చెప్పొచ్చు. ఒకప్పుడు ఫలానా పార్టీ ఫలానా శాతం ఓటింగ్ షేర్ శాతం సాధిస్తుందని ఖచ్చితమైన లెక్కలుండేవి. ప్రీ పోల్ సర్వేలన్నీ కౌంటింగ్ రోజున కాస్త అటు ఇటు నిజమయ్యేవి. కానీ ఇప్పుడు ఓటరే ఉషారు కావడంతో ఓటరు నాడి దొరక్క ఇటు పార్టీల అభ్యర్థులు, అటు సర్వే సంస్థలు జుట్టుపీక్కుంటున్నాయని చెప్పవచ్చు. ఎందుకిలా ....? అని ఒక్కసారి ఆలోచిస్తే ఓటర్లను కేవలం ఒక్క రోజు ఓటు వేసే యంత్రాలుగానే చూశారు తప్ప గెలిచి అందలమెక్కాక వారిని కనీసం పట్టించుకున్న పాపాన పోకపోవడం, ఎన్నికలప్పుడు ర్యాలీలకొస్తే బీరు, బిర్యాణీలు, కాసిన్ని డబ్బులిస్తే సరిపోతుందనే వైఖరే ఓటరును ఉషారు చేసిందని చెప్పొచ్చు.

**-అన్ని మీటింగ్‌లకూ సై**

ఒకప్పుడు ఫలానా పార్టీ ర్యాలీలో తిరిగితే ఆ ఓట్లన్నీ గంపగుత్తగా అదే పార్టీకి పడుతాయన్న నమ్మకం ఉండేది. ఒక దశలో అయితే ఒక పార్టీ మీటింగ్‌కు తెలిసిన వారిని కనీసం ఇంకో పార్టీ పట్టించుకునేదే కాదు. అయితే ఓటర్లు కూడా నాయకున్ని ఎంపిక చేసుకునే క్రమంలో ఒకటికి రెండు ఆలోచించి నిర్ణయం తీసుకున్నా చివరకు వారికి ఒరిగిందేమీ లేకపోవడంతో వారు సైతం దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలి... అనే చందంగా ఎన్నికలప్పుడే నాలుగు రూపాయలు సంపాదించుకోవాలనే ఆలోచన రావడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని చెప్పవచ్చు. ఏ పార్టీ వారు పిలిచినా గంపగుత్తగా గ్రూపుకు ఇంత... లెక్కలేసి మరీ బాజాప్తా ఆ పార్టీ కండువాలు మెడలో వేసుకొని, కర పత్రాలు చేత పట్టుకొని జై కొడుతుండడంతో అర్థంగాని అయోమయ పరిస్థితి నెలకొంది. మహిళా ఓటర్లే కాకుండా, పురుష ఓటర్లు సైతం సాయంత్రం క్వాటర్ సీసాలకు ఎగబడి ప్రచారాలకు పోతున్నారనే పరిస్థితులను బట్టి చూస్తుంటే అర్థమవుతోంది. ఏ పార్టీ మీటింగ్ అయినా, ఆ పార్టీ సిద్ధాంతాలు, మేనిఫెస్టో, అభ్యర్థి ఇలాంటి అంశాలేవీ పట్టించుకోకుండా కేవలం డబ్బులిస్తే మాత్రమే వస్తుండడంతో అభ్యర్థుల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. యుద్ధమన్నాక ఇక విజయమో, వీర స్వర్గమో తేల్చుకోవడానికి సిద్ధమైనట్టే ఎన్నికల్లో నిలబడ్డ అభ్యర్థులు సైతం నిల్వకు డబ్బులు సైతం, లేకున్నా ఆస్తులమ్మి మరీ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆర్భాటాలకే అధిక ప్రాధాన్యత ఇస్తుండడంతో ఖర్చు తడిసి మోపెడవుతుందని చెప్పవచ్చు. రోజువారి ప్రచారానికి 200 మందికి తగ్గకుండా ప్రచారంలో ఉండేలా చూస్తుండడంతోపాటు బహిరంగ సభలు, రోడ్ షోలకు వేల సంఖ్యలో జనం ఉప్పెనలా వస్తుండడం, వారు ఆ పార్టీ అనుకూలంగా జై కొడుతుండడంతో స్టార్ క్యాంపెయినర్లు గెలుపు పక్కా.. మాదే అంటూ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

ఏది ఎలా ఉన్నా, ఏ పార్టీ మీటింగ్ పెట్టినా వేల సంఖ్యలో జనం వస్తుండడంతో అసలు వీళ్లు ఏ పార్టీయో అర్థం కాక అభ్యర్థులు, ముఖ్య నాయకులు తలలు పట్టుకుంటున్నారు. మీటింగ్‌లకు లెక్కకు మించి వస్తుండడం అభిమానం అనుకోవాలో, డబ్బులకు ఆశపడ్డారనుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితులను అభ్యర్థులు సైతం బేరీజు వేసుకుంటూ వచ్చిన వారిలో సగం మంది ఓట్లేసినా గెలుపు నల్లేరుపై నడకే అన్నది మాత్రం వాస్తవమనే చెప్పాలి. ఏది ఏమైనా ర్యాలీలకు వస్తున్నవారందరూ ఎవరికి ఓట్లేస్తారో, ఎవరికి కర్రుకాల్చి వాత పెడుతారో కౌంటింగ్ డే రోజు మాత్రమే తెలుస్తుంది.

# ఎన్నికలు పారదర్శకంగా సజావుగా నిర్వహించాలి

**-అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలి**

**-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్**






సంగారెడ్డి, నవంబర్ 25, మనం న్యూస్ః శాసనసభ ఎన్నికల దృష్ట్యా పోలింగ్‌లో పాల్గొనే అధికారులందరూ సమన్వయంతో పని చేసి ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, చేయాల్సిన పనులపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి చివరి 72 గంటల్లో పోలింగ్ ఏర్పాట్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు వివరాలు పోలింగ్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో శానిటేషన్ చేసేలా చూడాలని, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి టీమ్‌లు అత్యంత అప్రమత్తగా పని చేయాలని సూచించారు. అన్ని చెక్‌పోస్టల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈనెల 29న ఎన్నికల పరికరాలైన ఈవియంలు తదితరాలను సెంటర్లకు సరఫరా చేసుకోవాలని ఆర్‌ఓలకు సూచించారు, ఎబ్ కాస్టింగ్ సిబ్బందికి, పోలీస్ ఫోర్స్‌కు మైక్రో అబ్జర్వర్లు విడివిడిగా షామియానా ఏర్పాటు చేయాలన్నారు. సెక్టోరియల్ అధికారులు ఈవిఎంలను జాగ్రత్తగా తీసుకు వెళ్లాలని, సెక్టోరియల్ అధికారులు పూర్తి స్థాయి జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి పోలీస్ అధికారులు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించి పోలీస్ సెక్టార్ అధికారి ఒకరు ఉంటారని, పోలీస్ రక్షణ లేకుండా ఈవియంలను ఎక్కడికి తీసుకువెళ్ల కూడదన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్‌లు చంద్రశేఖర్ మాధురి, అడిషనల్ ఎస్పీ అశోక్, డిఆర్‌ఓ నగేష మున్సిపల్ కమీషనర్‌లు తదితరులు పాల్గొన్నారు.




# బీఆర్‌ఎస్‌లో కొరవడిన 'కొత్త' దనం

- కర్యకర్తల్లో నేటికీ చిగురించని 'కొత్త' ఆశలు
- ఇంకా ఎన్నేండ్లు సిద్దిపేటోళ్ల పెత్తనమంటూ చికాకు
- బీజేపి జోరు, కాంగ్రెస్ హోరుతో బిఆర్‌ఎస్ ఆగమాగం
- గెలుపు అవకాశాలు అంతంతమాత్రమే అంటున్న కిందిస్థాయి నేతలు

దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 25, మనం న్యూస్..... ఒకప్పుడు తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీకి కంచుకోటగా ఉన్న దుబ్బాక నియోజకవర్గం ఒకే ఒక ఉప ఎన్నికతో పూర్తిగా బద్ధలైందనే చెప్పుకోవచ్చు. నాడు టిఆర్‌ఎస్ పార్టీకి నియోజకవర్గం నుండి కీలక నేతగా ఉన్న రామలింగారెడ్డి మరణానంతరం జరిగిన ఉప ఎన్నికల్లో దుబ్బాకలో బీజేపి పాగా వేసింది. అయితే రామలింగారెడ్డి ఉన్నంత కాలం మెదక్ ఎంపిగా ఉన్న 'కొత్త' ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నియోజక వర్గంలో అంతగా పర్యటించకపోవడం, కార్యకర్తలతో పరిచయం పెంచుకోకపోవడంతో ఆయనకు దుబ్బాక నియోజకవర్గంపై సరైన పట్టు లేకుండాపోయింది. అయితే అనారోగ్యం కారణంగా రామలింగారెడ్డి మరణించడంతో జరిగిన ఉప ఎన్నికల్లో దుబ్బాక గడ్డపై బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు పాగా వేశారు. అంతేకాకుండా ఈసారి ఆయన ఎలాగైనా దుబ్బాక గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలనే ధృఢ సంకల్పంతో ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు.దీంతో ఈసారి జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దుబ్బాక సీటును ఎలాగైనా తిరిగి కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతో ఎంపిగా ఉన్న ప్రభాకర్‌రెడ్డిని దుబ్బాక బిఆర్‌ఎస్ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం బి ఫామ్ అందించింది. కాగా దుబ్బాక నియోజకవర్గంలో బీజేపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు కొత్త ప్రభాకర్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకునే ప్రయత్నం పెద్దగా చేయకపోవడం, కలిసిన వారితోనే కార్యక్రమాలకు హాజరు కావడం, మిగతా వారిని పట్టించుకోకపోవడంతో చాలా వరకు కిందిస్థాయి నాయకులు, కార్యకర్తల్లో నైరాశ్యం ఏర్పడి పలువురు ఇప్పటికే బీజేపితోపాటు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న విషయం విధితమే. అయితే బిఆర్‌ఎస్ అధిష్టానం కొత్త ప్రభాకర్‌రెడ్డికి దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు కేటాయించినప్పటికీ నేటికీ నియోజకవర్గ వ్యాప్తంగా బిఆర్‌ఎస్‌లో 'కొత్త'దనం కనిపించడం లేదనే చెప్పుకోవచ్చు. గతంలోనే రామలింగారెడ్డి, వర్గం, కొత్త ప్రభాకర్‌రెడ్డి వర్గాలుగా ఉన్న బిఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల సందర్భంగా కలిసిపోయినట్లుగా కనిపిస్తున్నప్పటికీ అంతర్గతంగా సోలిపేట రామలింగారెడ్డి కుటుంబానికి టికెట్ ఇవ్వలేదని పలువురు లోలోపల మదనపడుతూనే ప్రభాకర్‌రెడ్డి ప్రచారంలో అంటీ ముట్టనట్టుగా పాల్గొంటున్నట్లు సమాచారం. అయినప్పటికీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి క్షేత్ర స్థాయిలో, కనీసం దుబ్బాక ప్రాంతంలోని కార్యకర్తలను సైతం గుర్తించకపోవడంతో ఎంతో మంది కార్యకర్తలు నిరాశ నిస్పృహలకు లోనైనప్పటికీ నమ్ముకున్న పార్టీ కోసమైనా పని చేయాలని పలువురు భావించి బిఆర్‌ఎస్ పార్టీ కోసం ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా ప్రచారంలో పాల్గొంటున్నట్లు వినికిడి.

## -నేటికీ చిగురించని 'కొత్త' ఆశలు

అయితే కొత్త ప్రభాకర్‌రెడ్డి పార్టీ పటిష్టతతోపాటు, క్యాడర్‌ను కాపాడుకోవడంలో తనదైన శైలిలో ముందుకు సాగే ప్రయత్నం చేస్తున్న క్రమంలో అనుకోకుండా అతనిపై జరిగిన కత్తి దాడితో పార్టీ క్యాడర్ పూర్తిగా నిరాశకు లోనైంది. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి హరీష్‌రావు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానంటూ ముందుకు వచ్చి కార్యకర్తల్లో నమ్మకం, ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. కాగా కొద్ది రోజులుగా కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రజల్లో తిరుగుతున్నప్పటికీ కార్యకర్తలకు ప్రభాకర్‌రెడ్డిపై కొత్త ఆశలు ఇంకా చిగురించలేదనే చెప్పుకోవచ్చు. పాతచింతకాయ పండు మాదిరి అన్నింటికీ హరీష్‌రావే అండగా ఉంటానంటూ ప్రచారంలో పాల్గొనడం, దుబ్బాక నియోజకవర్గంలో సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు సైతం ప్రచారంలో పాల్గొంటుండడంతో ఇంకా ఎన్నాళ్లు ఈ సిద్దిపేటోళ్ల పెత్తనం దుబ్బాకలో... అంటూ లోలోపల తమ అక్కసును వెల్లగక్కుతున్నారు. గత ఉప ఎన్నికల్లో పూర్తిగా సిద్దిపేట నాయకులే వచ్చి దుబ్బాకలో ప్రచారం చేసినప్పటికీ నాటి అభ్యర్థి సోలిపేట సుజాత ఓడిపోవడంతో దుబ్బాక నియోజకవర్గ పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశకు గురయ్యారనే చెప్పవచ్చు. అదేవిధంగా ప్రస్తుతం కూడా పలువురు సిద్దిపేట నియోజకవర్గ నాయకులు దుబ్బాక నియోజకవర్గంలో అప్పుడప్పుడు పర్యటిస్తూ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా ప్రచారంలో పాల్గొంటుండంతో స్థానిక నేతలు కాస్త ఎడమొహం పెడమొహంగానే ఉంటున్నారు.

## -మదిలో ఆగమాగం

ఓ వైపు మూడేళ్లు అధికారంలో ఉన్న బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు ఈసారి ఎలాగైనా ఐదేళ పాటు అధికారంలోకి వచ్చి దుబ్బాక నియోజకవర్గాన్ని తనదైన రీతిలో అభివృద్ధి చేసేందుకు పట్టు సాధించే ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారు. అదేవిధంగా ఒక్క అవకాశం... ఒకే ఒక్క అవకాశం ఇవ్వండి... ముత్యంరెడ్డి తనయుడిగా తన ఆశయాలను ముందుకు కొనసాగిస్తానంటూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సైతం నియోజకవర్గంలో భారీగా ప్రచారాలు నిర్వహిస్తూ ప్రజల్లోకి నేరుగా దూసుకెళ్తున్నారు. దీంతో బిఆర్‌ఎస్ పార్టీకి కాసింత అయోమయంలోనే పడిందనే చెప్పుకోవచ్చు. మొన్నటి వరకు కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందగా ఇప్పుడు ప్రజాక్షేత్రంలోకి వచ్చినప్పటికీ వారు ఆశించినంత మేర ప్రజల్లో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బిఆర్‌ఎస్ పట్ల సానుకూల పవనాలు లేకపోవడంతో పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు. ఈసారి కూడా దుబ్బాక గడ్డపై కాషాయ జెండా ఎగిరినట్లయితే ఇకపై పూర్తిగా బిఆర్‌ఎస్ పార్టీ దుబ్బాకలో పట్టు కోల్పోయే ప్రమాదం ఉందని వారు భావిస్తున్నారు. అంతేకాకుండా బీజేపి, కాంగ్రెస్ పార్టీల ప్రచార జోరు చూసి కిందిస్థాయి బిఆర్‌ఎస్ శ్రేణులు సైతం కాలికి బలపం కట్టుకొని ఇంటింటా తిరుగుతూ ఓటరు మహాశయులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ మొహమాటానికి తమకే వేస్తామంటూ ప్రజలు చెబుతున్నారని, కానీ అంతర్గతంగా ప్రజలంతా బీజేపి వైపే ఉన్నారని పలువురు బిఆర్‌ఎస్ నేతలే బాహాటంగా మాట్లాడుకుంటూ ఈసారి పార్టీ గెలుపుపై అంతంతమాత్రంగానే ఆశలు అనుకుంటున్నారు.

## -కేసీఆర్ సభతో మార్పు వచ్చేనా...?

ఇప్పటికే బీజేపి, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా మండలాల కేంద్రాల్లో పలువురు ప్రముఖులతో సభలు, రోడ్ షోలు నిర్వహిస్తూ వస్తుండగా నేడు దుబ్బాక బిఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా సీఎం కేసీఆర్ స్వయంగా హాజరుకానున్నారు. అయితే నేడు సభలో సీఎం కేసీఆర్ ప్రస్తావించే అంశాలు, ఆయన ఉపన్యాసం ఎంతమేరకు ప్రజల్లో ప్రభావం చూపుతుందోనని పార్టీ శ్రేణులతోపాటు నియోజకవర్గ ప్రజలు సైతం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే బిఆర్‌ఎస్ పార్టీ భవితవ్యం ఈసారి ఎన్నికల్లో ఎలా ఉంటుందో తెలియాలంటే మరో వారం రోజుల పాటు వేచి చూడాల్సిందే.

# గత పాలకుల నిర్లక్ష్యంతోనే రైతులకు కష్టాలు



**-ప్రతి ఎకరాకు సాగునీరందించిన ఘనత కేసీఆర్‌దే**

**-ఇంటింటికి మంచినీరుతో ప్రజారోగ్యానికి పెద్దపీట**

**-ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**





గజ్వేల్, నవంబర్ 25, మనం న్యూస్ః గత పాలకుల నిర్లక్ష్యం వల్లే పంటలు ఎండిపోయి రైతులు కష్టాలు పడ్డారని, రైతుల కష్టాలు చూసి సీఎం కేసీఆర్ గోదావరి నీళ్లు తెచ్చి రైతుల పొలాలకు నీళ్లు అందించి రైతుల కష్టాలు తీర్చారని ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్ మండలం కొల్గూరు, అహ్మదీపూర్, షేర్‌పల్లి, జిలాల్‌పూర్, ధర్మారెడ్డిపల్లితోపాటు పలు గ్రామాల్లో సీఎం కేసీఆర్‌కు మద్ధతుగా కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గోదావరి నీళ్లు తీసుకువచ్చి రాష్ట్రమంతా సస్యశ్యామం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రైతుల కష్టాలు చూసిన సీఎం కేసీఆర్ గోదావరి నీళ్లతో సాగునీరు అందించి వారి కష్టాలు తీర్చారన్నారు. నేడు తెలంగాణ వరిధాన్యం పండించడంలో దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరు ఈసారి ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసి ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపిపి అమరావతి, జెడ్పీటిసి పంగా మల్లేశం, ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు బెండె మధు తదితరులు పాల్గొన్నారు.

**-పార్టీలోకి పలువురి చేరిక**

అబద్ధాల బీజేజి మాటలు నమ్మే స్థితిలో ఆర్ అండ్ ఆర్ ప్రజలు లేరని ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ముంపు గ్రామాల ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్లు 80 మంది శనివారం ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే మా సమస్యలు పరిష్కారం అవుతాయని, అండగా ఉంటారన్నారు. సీఎం కేసీఆర్ ఆటో డ్రైవర్లందరికీ ఫిట్‌నెస్ టాక్స్ ఛార్జీలు మాఫీ చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అబద్ధపు బీజేపి జూటా మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. సీఎం కేసీఆర్‌కు వారంతా సంపూర్ణ మద్ధతు తెలుపుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో చింతకింది శ్రీనివాస్, మెతుకు కనకయ్య, గాంధారి లక్ష్మణ్, గూడూరి మల్లేశం, భూపతి, శ్రవణ్, మందగారి యాదగిరి, బచ్చల రాజయ్య, దాకూరి స్వామి, మరకంటి యాదగిరి, బిక్షపతి, రమేష్, ఆంజనేయులు, ప్రకాష్‌తోపాటు తదితరులు ఉన్నారు. అనంతరం గజ్వేల్‌లోని వైష్ణవి గార్డెన్‌లో మర్పడగ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్ యాదగిరి, ప్రభాస్‌లు బిఆర్‌ఎస్‌లో చేరారు.కొండపాక మండలం దుద్దెడకు చెదిన కాంగ్రెస్ నాయకులు కరుణాకర్; నరేష్, సాయి, వెంకటేష్, ప్రభాకర్, రియాజ్, జహీర్, గణేష్, జగదీష్, శివ, బాబూలాల్‌తోపాటు 20 మంది యువకులు పార్టీలో ప్రతాప్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీజేపి పార్టీ కేవలం వారి ఉనికి కోసమే పాకులాడుతున్నారన్నారు.

## మూడవసారి కేసీఆర్‌దే అధికారం

**-బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొంపల్లి మహేష్**



జగదేవ్‌పూర్, నవంబర్ 25, మనం న్యూస్ః అభివృద్ధి, సంక్షేమ పథకాలే బిఆర్‌ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అని గజ్వేల్ ప్రజానీకం తెలివిగల వారని, మూడవసారి కేసీఆర్‌దే అధికారమని బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొంపల్లి మహేష్ అన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో గజ్వేల్ ప్రజలంతా గజ్వేల్ అభ్యర్థి కేసీఆర్‌కు కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని ఆయన అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని చీకట్లో ఉంచితే తొమ్మిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ఆద ర్శంగా నిలిపారన్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, రైతులకు పంటలకు 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, బిసిబంధు ద్వారా అన్న వర్గాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. రాష్ట్రంలో మూడవసారి సీఎం కేసీఆర్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. గజ్వేల్ నుండి కేసీఆర్‌కు లక్ష పై చిలుకు మెజార్టీ ఇస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు గ్రూపు తగాదాలతో కకావికలం అవుతున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీల మీద ప్రజలకు నమ్మకం లేదన్నారు. గజ్వేల్ నియోజకవర్గం రూపు రేఖలు మారాయన్నారు. గజ్వేల్ నియోజకవర్గం అన్ని రకాలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. మంత్రి హరీష్‌రావు, ఎంపి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి సారథ్యంలో గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తున్నారని తెలిపారు.

## బిఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర నాయకులు ఏర్పుల మహేష్**



కొమురవెల్లి, నవంబర్ 25, మనం న్యూస్ః కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను పేద ప్రజల కోసం ప్రవేశపెట్టారని బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర నాయకులు ఏర్పుల మహేష్ అన్నారు. శనివారం కొమురవెల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. తొమ్మిదేళ్లలో గ్రామాల రూపురేఖలు మారాయని, రోడ్లు, డ్రైనేజీ, నీటి వసతి వంటి సౌకర్యాలు మెరుగు పడ్డాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతుబీమా, రైతుబంధు, ఆసరా పెన్షన్‌లు, కళ్యాణలక్ష్మి, దళితబంధు వంటి పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజలకు పెద్ద దిక్కుగా మారాడన్నారు. జనగామ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ముందుకు పోతుందన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి కారు గుర్తుకే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి జెడ్పీటిసి సభ్యులు సిలివేరు సిద్ధప్ప, కొమురవెల్లి గ్రామ ఉప సర్పంచ్ కొండ శ్రీధర్, పిఎసిఎస్ డైరెక్టర్ బత్తిని నర్సింలు గౌడ్, పోతుగంటి కొమురవెల్లి, గజ్జె మురళి, కానుగుల శ్రీనివాస్, ముత్యం కరుణాకర్, గజ్జె అశోక్, కిషన్, వెంకటేష్, రవి, సత్తయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్షర పాఠశాలలో నమూనా ఎన్నికలు




జగదేవ్‌పూర్, నవంబర్ 25, మనం న్యూస్ః జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని అక్షర పాఠశాలలో విద్యార్థులతో శనివారం ఎన్నికల నమూనాను నిర్వహించారు. విద్యార్థులు ఓటర్లుగా, పోలింగ్ అధికారులుగా విధులు నిర్వర్తించారు. వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లను వేసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల్లో బరిలో ఏడుగురు విద్యార్థులు నిలవగా వారికి కేటాయించిన గుర్తులపై ప్రచారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ జరిగే విధానాన్ని విద్యార్థులలకు కళ్లకు కట్టినట్లు వివరించారు. అనంతరం ఎన్నికైన విద్యార్థి రోహన్‌రెడ్డిని యజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రామస్వామి, ప్రిన్సిపల్ సంతోషి జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ సుదర్శన్, ఉపాధ్యాయులు బాలమణి, రేణుక, సిబ్బంది పాల్గొన్నారు.

## కేసీఆర్‌కే మా మద్ధతు



కొండపాక, నవంబర్ 25, మనం న్యూస్ః కేసీఆర్‌కే మా మద్ధతు ఉంటుందని మండల కేంద్రమైన కొండపాకలో ముదిరాజ్‌లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామంలోని గుండం బావికి చెందిన ముదిరాజ్‌లు సుమారు వంద కుటుంబాల వారు ఏకగ్రీవ తీర్మానంతో డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డికి తీర్మాన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కే తమ మద్ధతు ఉంటుందని ముదిరాజ్ కులస్తులు ఆకుల చంద్రం, యాదగిరి, వీరయ్య, కనకయ్య, లింగం, గణపురం యాదగిరి ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టి మాధురి, మాజీ సర్పంచ్‌రామకృష్ణారెడ్డి, నాయకులు బొద్దుల కనకయ్య, మైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఓట్ల కోసమే కాంగ్రెస్ రాజకీయం

- బతికున్నప్పుడు పట్టించుకోలేదు..ఇప్పుడు గుర్తొచ్చారా..?
- నాడు పి.వి.ని నిర్లక్ష్యం చేసింది కాంగ్రెస్సే
- పి.వి. గురించి మాట్లాడే అర్హత ప్రియాంకకు లేదు
- మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు

హుస్నాబాద్,నవంబర్ 25,(మనం న్యూస్)ః మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి.నరసింహారావు పేరును ఉచ్ఛరించే నైతిక హక్కు, అర్హత కాంగ్రెస్ పార్టీకి, ప్రియాంక గాంధీకి లేదని కేవలం ఓట్ల కోసమే పి.వి.పేరును కాంగ్రెస్ పార్టీ వాడుకుని రాజకీయం చేస్తుందని మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు ధ్వజమెత్తారు. పట్టణ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి శనివారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెప్టెన్ లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ హుస్నాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ స్వర్గీయ పివి నరసింహరావు కుటుంబం మాకు దగ్గర అని అనడం ఆ కుటుంబాన్ని ఎప్పుడూ మరిచిపోమ అంటుంటే నవ్వు వస్తోందన్నారు. నాడు మైనార్టీ ప్రభుత్వాన్ని ఐదేళ్లు నడిపారని, నాడు దేశ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా ఉండేదని, బంగారాన్ని తాకట్టు పెట్టిన దుస్థితి ఉందన్నారు. కానీ ఆర్థిక సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించారని, సరళీకృత విధానాలతో ప్రపంచమే గర్వించదగ్గ నేతగా అపార చాణుక్యుడి పేరు తెచ్చుకున్నాడని ఆయన గుర్తు చేసారు. బహుబాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల పితామహుడు, సాహితివేత్త, తెలుగు ప్రజల గుండె చప్పుడు, తెలంగాణ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటిన మహానీయుడు పి.వి.ప్రధాని అన్నారు. అయిన దిగిన తర్వాత 1996 లో దిగిపోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఏనాడు ఆయనను పట్టించుకోలేదన్నారు. పి.వి.మృతి చెందితే కనీసం పట్టించుకోలేదని, ఆయన అంత్యక్రియల కార్యక్రమాన్ని కూడా సరిగా నిర్వహించకపోతే ప్రజలు ఎంతో బాధపడ్డారని ఆయన గుర్తు చేసారు. పివి అంత్యక్రియలు ఢిల్లీలో కాకుండా హైదరాబాద్‌లో నిర్వహించాలని కాంగ్రెస్ జాతీయ కార్యాలయానికి కూడా పివి పార్థివ దేహాన్ని తీసుకుపోలేదన్నారు. తెలుగు ప్రజల మనోభావాలు నాడు కాంగ్రెస్ పార్టీ దెబ్బతీసిందన్నారు. నాడు జరిగిన పరిణామాలకు తాను కూడా ప్రత్యక్ష సాక్షినని, నాడు వైఎస్ మంత్రి వర్గంలో తాను ఉన్నానని, ఇతర రాష్ట్రాల పర్యటనలో ఉన్న వైఎస్‌ను హుటాహుటిన హైదరాబాద్ పంపించి పివి పార్థివ దేహాన్ని ఢిల్లీ నుండి హైదరాబాద్ పంపించిందన్నారు. పివిని, పివి చేసిన కృషిని బిఆర్ఎస్ పార్టీ గుర్తించిందని, సీఎం కేసీఆర్ పివి శత జయంతి ఉత్సవాలను చారిత్రాత్మకంగా, ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారని ఆయన గుర్తు చేసారు. ఆయన పేరుతో ఎన్నో కార్యక్రమాలు గ్రామ గ్రామాన నిర్వహించారని, ఆయన పై సెమినార్లు, పత్రికల్లో వ్యాసాలు, తదితర ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారన్నారు. పివి కుమార్తె సురభి వాణి దేవికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని, పివి స్వగ్రామం వంగరలో పివి స్మృతివనం నిర్మాణం కోసం పర్యాటక శాఖ నుండి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పివి కృషి వల్లే నేడు కాంగ్రెస్ కొద్దో గొప్పో బతికి ఉందన్నారు. మన్మోహన్ సింగ్ పేరు చెప్పుకుని కాంగ్రెస్ ఇన్ని రోజులు బతికిందని, మన్మోహన్ సింగ్‌ను కూడా వెలుగులోకి తీసుకువచ్చింది పివి అన్న విషయం గుర్తుంచుకోవాలని, ఇది కాంగ్రెస్ గొప్పతనం కాదని పివి, మన్మోహన్ సింగ్‌ల గొప్పతనమన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్, బిజెపి పాలిత ప్రాంతాల్లో ఎందుకు అమలు చేయడంలేదని ఆయన ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ తెలంగాణలో జయకేతనం ఎగురవేస్తుందని, హుస్నాబాద్‌లో సతీశ్‌కుమార్ భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నాడని మరోసారి సీఎంగా కేసీఆర్ పగ్గాలు చేపడుతాడని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జడ్పీచైర్మన్ సుధీర్‌కుమార్, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు, తదితరులున్నారు.





## ఓటుతో హరీష్‌రావుకు బుద్ధి చెప్పాలి

### సిద్దిపేట బీజేపి ఎమ్మెల్యే అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి



సిద్దిపేట అర్బన్, నవంబర్ 25, మనం న్యూస్ః పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు చెక్ పెట్టి మంత్రి హరీష్‌రావుకు బుద్ధి చెప్పాలని బీజేపి సిద్దిపేట అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని గాడిచర్లపల్లి, మోహినిపుర, కాంచిట్ చౌరస్తా ప్రాంతాల్లో బీజేపి శ్రేణులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి హరీష్‌రావు మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం తప్ప ఎవరూ బాగుపడలేదని విమర్శించారు. కొత్తగా ఎంతమందికి నౌకర్లు, కొత్త రేషన్ కార్డులు వచ్చాయని ప్రశ్నించారు. బంగారు తెలంగాణ అంటే ఇదేనా అని విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఎరువులపై భారీ సబ్సిడీ భరిస్తూ తక్కువ ధరకే రైతులకు అందిస్తుందన్నారు. తెలంగాణ కోసం అమరులైన కుటుంబాలు శోకంతో కుమిలిపోతుంటే కేసీఆర్ కుటుంబం అందినకాడికి దోచుకొని సంతోషంగా పబ్బం గడుపుతోందని ఆరోపించారు. ప్రజల ఆదరణ చూస్తుంటే తప్పకుండా బీజేపి గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో హరీష్‌రావుకు ఓటమి రుచి చూపిస్తామన్నారు. ఈసారి బీజేపికి అవకాశం ఇవ్వాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పత్రి శ్రీనివాస్ యాదవ్, గోనె మార్కండేయులు, యాదన్ రావు, ఎలుక ఎల్లం, నరేందర్, మహేందర్, కొమ్ము ఎల్లం, అజయ్, నితిన్, నవీన్, గణేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాకలో బీజేపి జెండా ఎగురడం ఖాయం

### బీజేపి నాయకులు వజ్జపల్లి తిరుపతి



మిరుదొడ్డి, నవంబర్ 25, మనం న్యూస్ః దుబ్బాకలో బీజేపి జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపి నాయకులు వజ్జపల్లి తిరుపతి అన్నారు. శనివారం మిరుదొడ్డి మండల పరిధిలోని ఆరెపల్లి గ్రామంలో బీజేపి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధిలో కుంటు పడిందన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మాటలు ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. ఉప ఎన్నికల్లో గెలిచిన బీజేపి ఎమ్మెల్యే రఘునందన్‌రావు రెండున్నరేళ్ల కాలంలో దుబ్బాక నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు గువ్వాడి రజనీకాంత్, శ్రీనివాస్, కుమార్, నిఖిల్, రాజు, అనిల్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## ఆరు నెలల్లో బిసి డిక్లరేషన్ అమలు చేస్తాం

### బిసిలను మోసగిస్తున్న బిఆర్ఎస్, బీజేపిలు

### ఏఐసిసి ఓబిసి సెల్ వైస్ ఛైర్మన్ వినయ్ కుమార్



సిద్దిపేట అర్బన్, నవంబర్ 25, మనం న్యూస్ః అధికారం వచ్చిన ఆరు నెలల లోపు బిసి డిక్లరేషన్ అమలు చేస్తామని ఏఐసిసి ఓబిసి సెల్ వైస్ ఛైర్మన్ వినయ్ కుమార్ అన్నారు. శనివారం సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ సాధించిన తర్వాత మారతాయనుకున్న బడుగు బలహీన వర్గాల జీవితాలు మారని పరిస్థితిలో ఉన్నాయన్నారు. బిఆర్ఎస్ ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. బీజేపి ఆధిపత్య కులాలే అధికారంలో ఉండాలనుకుంటుందని, బిసిలపై బీజేపికి చిత్తశుద్ధి ఉంటే బండి సంజయ్‌ను పక్కన పెట్టి కషన్‌రెడ్డికి రాష్ట్ర అధ్యక్ష పదవి ఎందుకు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ గెలువద్దనే ఒకే ఒక్క కారణంతోనే బిసి ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపి ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నవోదయ వంటి పాఠశాలలను ప్రతి మండలంలో నెలకొల్పి పిల్లలు ఆర్థికంగా స్థిరపడేటట్లు చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టిస్తుందని, అధికారం వచ్చిన వారంలోపు బిసి డిక్లరేషన్‌తోపాటు ఆరు గ్యారంటీ హామీలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు హరీష్‌కుమార్, కిషాన్ సెల్ రాష్ట్ర నాయకులు నాయిని నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లకు అన్యాయం చేసిన కేసీఆర్

### రాష్ట్ర ముదిరాజ్ సేవా సంఘం అధ్యక్షులు ఉప్పరి నారాయణ



దుబ్బాక, నవంబర్ 25, మనం న్యూస్ః జనాభా దమాషా ప్రకారం ముదిరాజ్‌లకు రావాల్సిన హక్కులను కేసీఆర్ ప్రభుత్వం అందించడం లేదని, ఎన్నికల్లో ముదిరాజ్‌లకు కేటాయించాల్సిన సీట్లను కేటాయించకుండా ముదిరాజ్‌లకు బిఆర్ఎస్ సర్కార్ అన్యాయం చేసిందని రాష్ట్ర ముదిరాజ్ సేవా సంఘం అధ్యక్షులు ఉప్పరి నారాయణ అన్నారు. శనివారం దుబ్బాకలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముదిరాజ్ ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన జిఓలను రద్దు చేసి బిసి డి నుండి బిసి ఏ లో వర్గీకరణ జరిపి చేర్చకుండా 20 వేల కుటుంబాలకు ఉద్యోగాలు రాక రోడ్డున పడ్డారన్నారు. బహుజన వర్గాలకు ఎవరు న్యాయం చేస్తారో వారికే మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. బిసిలు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. రాజ్యాధికారంతోనే ముదిరాజ్‌ల తలరాతలు మారుతాయన్నారు. ఎన్నికల సందర్భంగా ముదిరాజ్ కుల సంఘాలు పార్టీలకు ఏకగ్రీవ తీర్మానం చేయడం పట్ల ముదిరాజ్‌లకు అన్యాయం జరుగుతుందన్నారు. బిసి నాయకుడిని సీఎం చేసే పార్టీకే పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీకి ముదిరాజ్ సంఘాల పూర్తి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. తొమ్మిదేళ్లలో ముదిరాజ్‌లకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఎక్కువ శాతం ఉన్న ముదిరాజ్‌లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వని పార్టీ బిఆర్ఎస్ అన్నారు. జాతి బిడ్డల అభ్యున్నతి కోసం మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం చాలా గొప్పదని, పదవులు ఆశించకుండా కేవలం కుల అభివృద్ధికి 30 ఏళ్లుగా ఏ పార్టీ కండువా కప్పుకోకుండా పదవులకు ఆశపడకుండా ఎస్సీ వరీగకరణపై పోరాటం చేసి ప్రధాని మోదీ దృష్టి తీసుకువెళ్లిన ఘనత మందకృష్ణ మాదిగదే అన్నారు.

# శ్రీ మహా కైలాసేశ్వరాలయ ప్రాంగణంలో
# కార్తీక పౌర్ణమి వేడుకలు

### బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామ్‌శర్మ ఆధ్వర్యంలో కోటి దీపారాధన

దౌల్తాబాద్, నవంబర్ 25, మనం న్యూస్ః శ్రీ చాముండేశ్వరీ గురుదత్తపీఠం ఆధ్వర్యంలో దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని దొమ్మాట గాజులపల్లిలోని కైలాసపురంలో నిర్మితమవుతున్న శ్రీ మహాకైలాసేశ్వరాలయ ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు బ్రహ్మ శ్రీ కొడకండ్ల శ్రీరామ్‌చరణ్ శర్మ గురూజీ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పురాతన, ఋుద్యాత్మిక చరిత్ర కలిగిన ఈ ప్రదేశంలో వందల ఏళ్ల నాటి శివాలయం జీర్ణోద్ధరణ చేయాలన్న దైవసంకల్పంతో ఇక్కడ బృహత్తర ఆలయానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. నాటి నుండి బాలాలయాన్ని స్థాపించడం జరిగిందని, నిత్య పూజలకు, అభిషేకాలకు భక్తులు రావడం రాబోయే రోజుల్లో కైలాసపురం మహా క్షేత్రంగా పరిఢవిల్లబోతుందని చెప్పడానికి నిదర్శనమన్నారు. ప్రస్తుత కార్తీక మాసాన్ని పురస్కరించుకొని 27వ తేదీ సోమవారం రోజున పౌర్ణమి వేడుకలు ఘనంగా కోటి దీపారాధన చేసి నిర్వహించనున్నామని, ఇందుకు మహిళలు పెద్ద ఎత్తున రావాలని ఆయన సూచించారు. కార్తీక పౌర్ణమి రోజున మహారుద్రాభిషేకం, కోటి దీప ప్రజ్వలన, జ్వాలాతోరణం, పల్లకి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్తీక పౌర్ణమి వేడుకలను విజయవంతం



చేయాలని ఆయన కోరారు. సాయంత్రం కైలాపురంలోని శివాలయంలో అభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# నేటి సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయండి

### పిఎసిఎస్ ఛైర్మన్ లింగాల రాజలింగారెడ్డి



మిరుదొడ్డి, నవంబర్ 25, మనం న్యూస్ః సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో నేడు నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిఎసిఎస్ ఛైర్మన్ లింగాల రాజలింగారెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్ ఈనెల 26న బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా బహిరంగ సభలో ప్రసంగించనున్నట్లు తెలిపారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట మండలాలతోపాటు ఆయా గ్రామాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున బహిరంగ సభకు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా అష్టాదశ శక్తిపీఠ ప్రతిష్టా మహోత్సవాలు



కొండపాక, నవంబర్ 25, మనం న్యూస్ః కొండపాక ఆనంద నిలయం ఆవరణలో అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి ప్రతిష్టా మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి స్వామి పర్యవేక్షణలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వరుణాయనము, గోపూజ, గురు వందనం, శాంతి పాఠము, గణపతి పూజ, పుణ్యాహవచనము, మాతృకా, నాందీ దేవత ఆహ్వానము, దీక్షధారణ, పంచగవ్యప్రాశన, రక్షాబంధనము, యోగినీ, బ్రహ్మాది దేవతల ఆవాహనములు, కలశ స్థాపనలు, వేద పారాయణము, మూలమంత్ర జపములు, చండీ పారాయణము నిర్వహించారు. సాయంత్రం అగ్ని మథనము, కుండ సంస్కారము, అగ్ని ప్రతిష్ట పర్యగ్నికరణము, బిలాధి దానము, పంచగవ్యాధివాసములు జరిగాయి. అంతకుముందు పుష్పగిరి పీఠాధిపతిని పూర్ణకుంభంతో అర్చకుల వేదమంత్రాల మధ్య స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆనంద నిలయం ట్రస్టు సలహాదారు, ప్రభుత్వ సలహాదారు కె.వి. రమణాచారి, ట్రస్టు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపి నుండి బిఆర్ఎస్‌లోకి చేరికలు



దౌల్తాబాద్, నవంబర్ 25, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టో చూసి బీజేపి పార్టీకి చెందిన యువకులు సర్పంచ్ యాదగిరి, ఎంపిటిసి తిరుపతి ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరారు. శనివారం మండల పరిధిలోని ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన బీజేపి యువకులు దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ కార్యకర్తలు కష్టపడి పనిచేసే ఎమ్మెల్యేగా గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచిన క్షణం నుండి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిలుక వైకుంఠంతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# హరీష్‌రావుకు దేడ్ లాఖ్ మెజార్టీ అందించాలి

### బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వహీద్ ఖాన్

సిద్దిపేట అర్బన్, నవంబర్ 25, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు నిరంతరం రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే పని చేస్తూ తెలంగాణను దేశంలోనే అగ్రభాగాన నిలిపిన సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా నిలపడంతో పాటు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే మంత్రి హరీష్‌రావుకు దేడ్‌లాఖ్ మెజార్టీ అందించి గెలిపించాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వహీద్ ఖాన్ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ ఆపదలో ఆదుకుంటూ సిద్దిపేట నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలిపిన మంత్రి హరీష్‌రావుకు లక్షన్నర పై చిలుకు మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సిద్దిపేట జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ప్రజల సంక్షేమానికి పాటుపడే వ్యక్తి హరీష్‌రావు అని, ఆయనను మరోసారి ప్రజలు కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో



గెలిపించాలని కోరారు.

# ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకోవాలి

### తొగుట సిఐ కమలాకర్



దౌల్తాబాద్, నవంబర్ 25, మనం న్యూస్ః ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని తొగుట సిఐ కమలాకర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దొమ్మాట, ఇందుప్రియాల్ గ్రామాల్లో తొగుట సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కలిసి వీధుల గుండా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఓటర్లు ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, ఏఎస్ఐ సాయిలుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చు



సిద్దిపేట రూరల్, నవంబర్ 25, మనం న్యూస్ః ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన జరిగితే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటర్లను ప్రభావితం చేయకుండా ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న కృషిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని అన్నారు.

## బీజేపికి ఓటేస్తే ఆగమైతారు

### కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



జగదేవ్‌పూర్, నవంబర్ 25, మనం న్యూస్ః బీజేపికి ఓటేస్తే ఆగమైపోతారని, అభివృద్ధి చేసే కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపిపి బాలేశం గౌడ్, ఎంపిటిసి కవిత శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అవ్వ... బీజేపికి ఓటేస్తే ఆగమైపోతుంది.. నీ పెద్దకొడుకు సీఎం కేసీఆర్ కారు గుర్తుకు ఓటేసి అధిక మెజార్టీతో దెలిపించాలని ఎంపిపి బాలేశం గౌడ్, ఎంపిటిసి కవిత శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు బుద్ధ నాగరాజు, కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ కుమ్మరి కనకయ్య, జగదేవ్‌పూర్ మాజీ సర్పంచ్ కొంపల్లి కరుణాకర్, కో ఆప్షన్ సభ్యులు ఎక్బాల్, వెంకటేశంలు మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్‌కు లక్షకు పై మెజార్టీతో గెలిపించుకుంటామని, ఏ వార్డు వెళ్లినా, ఏ గ్రామానికి వెళ్లినా బిఆర్ఎస్‌కు మద్ధతు తెలుపుతున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ పథకాలు తిరిగి కొనసాగాలంటే బిఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. వారి వెంట బాల్‌నర్సయ్య, కర్ణాకర్ ఉన్నారు.

## ఈటల రాజేందర్‌నే గెలిపించుకుంటాం

### ఈటల రాజేందర్‌కు ముదిరాజ్‌ల మద్ధతు



జగదేవ్‌పూర్, నవంబర్ 25, మనం న్యూస్ః బడుగు బలహీన వర్గాల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి ఈటల రాజేందర్ అని, వారిని గజ్వేల్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ముదిరాజ్ మండల యూత్ అధ్యక్షులు హేమ సురేష్ అన్నారు. గజ్వేల్ నియోజకవర్గం నుండి బీజేపి ఎమ్మెల్యే అభ్యర్థి బిసి ముద్దుబిడ్డ ఈటల రాజేందర్ ముదిరాజ్ పోటీ చేస్తున్న సందర్భంగా వారికి మండల ముదిరాజ్ సంఘం మద్ధతుగా ఉంటుందని మండల యూత్ అధ్యక్షులు హేమ సురేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద జగదేవ్‌పూర్ మండలం ముదిరాజ్ సంఘం నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. బడుగు బలహీన వర్గాల కష్టసుఖాలు తెలిపిన వ్యక్తి ఈటల రాజేందర్ అని, ఆయనను నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గంతోపాటు బడుగు బలహీన వర్గాల ప్రజలందరినీ కలుపుకుపోతూ బిసిలను ఏకం చేస్తూ ఈటల రాజేందర్ గెలుపుకు కృషి చేస్తామన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బిసిలు ఏకతాటిపైకి వచ్చి బిసి ముఖ్యమంత్రిని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ నాయకులు పెద్దమ్మల రాజయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చింతల బాల్‌రాజు, బరిగె నర్సింలు, ఎల్లేష్, లక్ష్మణ్, రామచంద్రం, కిషన్, రమేష్, రాజు, సత్యనారాయణ, ఆయా గ్రామాల యూత్ అధ్యక్షులు అనిల్, వినోద్, రాజ్‌కుమార్, నర్ర నర్సింలు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు

### -అభివృద్ధి, సంక్షేమం బిఆర్ఎస్‌తోనే సాధ్యం
### -కాళేశ్వరంతో జీవనదిలా మారిన కూడవెల్లి
### -జెడ్పి ఛైర్‌పర్సన్ రోజా శర్మ



మిరుదొడ్డి, నవంబర్ 25, మనం న్యూస్ః బీజేపి, కాంగ్రెస్ నాయకుల మాటలు ప్రజలు నమ్మి మోసపోవద్దని జెడ్పి ఛైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ అన్నారు. శనివారం అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి, మోతె గ్రామాలలో బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం ఎంపి ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత, రాష్ట్ర యువజన విభాగం నాయకులు సోలిపేట సతీష్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్ధికంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కేవలం వారి రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసమే బిఆర్ఎస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు రాగానే ప్రజల ముందుకు



వచ్చి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని చూసే నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. రైతుల సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు, రైతుబీమా, ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి రైతులకు సాగునీరు అందించడం జరిగిందన్నారు. దుబ్బాక నియోజకవర్గ రైతులకు సమీపంలోని కూడవెల్లి వాగు జీవనదిలా ప్రవహిస్తుందంటే సీఎం కేసీఆర్ పుణ్యమే అన్నారు. కావున దుబ్బాక నియోజకవర్గ ప్రజలు నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మోతె వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బిఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోరం రాజేశ్వర్ కుమారుడు రవిచంద్, కూతురు కీర్తనలు వారు దాచుకున్న డబ్బులను ఎన్నికల ఖర్చుల నిమిత్తం రూ. 5016లు ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులతకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, సుగుణ నర్సింలు, మాజీ ఎంపిపి పంజాల కవిత శ్రీనివాస్‌గౌడ్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రవి, దుబ్బాక పిఎసిఎస్ ఛైర్మన్ కైలాస్, మానస రంజిత్, ఎన్.వై. యాదవ్, పర్శరాములు, ర్యాకం శ్రీరాములు, రామస్వామి, మురళి, రవి కుమార్, నరేష్‌తోపాటు మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి, నవంబర్ 25, మనం న్యూస్ః జిల్లాలో శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శనివారం ఎన్నికల అధికారి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆయా పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలింగ్ రోజున రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల ఎన్నికల కమీషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రం నుండి 200 మీటర్ల పరిధిలో ఎలాంటి ఎన్నికల బూత్ ఏర్పాటు చేయరాదని, ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆస్తులపై ఆక్రమణల ద్వారా ఎలాంటి పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయరాదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకూడదని, ఎన్నికల నిబంధనల మేరకు మెదలాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్స్ అనుమతించరాదని, పోలింగ్ స్టేషన్‌కు వంద మీటర్ల పరిసరాల్లో ఎలాంటి పరికరాలు ఉపయోగించరాదన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరిని ఓటు వినియోగించుకునేలా చైతన్యవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, డిఆర్ఓ నగేష్, ఎన్నికల విభాగపు అధికారి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## సొంత గూటికి చేరిన కొంగర ఎల్లారెడ్డి

### సాదరంగా ఆహ్వానించిన బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు





దుబ్బాక టౌన్, నవంబర్ 25, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా భారతీయ జనతా పార్టీని పరిచయం చేసిన వ్యక్తి తిరిగి తన సొంత గూటికి చేరారు. దుబ్బాక మండలం చీకోడు గ్రామానికి చెందిన కొంగర ఎల్లారెడ్డి 1987లో దుబ్బాక బీజేపిలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర నాయకులుగా పార్టీ కోసం ఎంతగానో పని చేశారు. అనంతరం 2001లో తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కళాకారుడిగా ఎన్నో తెలంగాణ పాటలు పాడి నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. తదనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే రఘునందన్‌రావు స్వగృహంలో తిరిగి బీజేపిలో చేరగా ఆయనకు రఘునందన్‌రావు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని మోదీ సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై, ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేస్తున్న అభివృద్ధికి ముగ్ధుడై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలోని యువత బాగుపడాలంటే బీజేపితోనే సాధ్యమన్నారు. దొరల పాలన, రౌడీల పాలన, చిల్లర రాజకీయాలు పోవాలంటే బీజేపిని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతకుముందు దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు పరికి చింటుగౌడ్ ఎమ్మెల్యే సమక్షంలో బిజేపిలో చేరారు.

# పబ్బు కావాలన్న వాడు ఆర్డీఓ కార్యాలయమెందుకు అడగలే

మొదటి పేజీ తరువాయి..

కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. యువకులు, బీజేపి నాయకులు హనుమాన్ దేవాలయం నుండి అక్బర్‌పేట చౌరస్తా వరకు ఘన స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున ర్యాలీ తీసారు. అనంతరం గజమాలతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్ర ఏర్పాటు కోసం కృషి చేసి మండల కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దుబ్బాక నియోజకవర్గానికి మొదటి శత్రువు ఎవరైనా ఉన్నారంటే వారు మంత్రి హరీష్‌రావే అని అన్నారు. అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రాన్ని మండలం కాకుండా అడ్డుకున్నది హరీష్‌రావే అని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 15 మండలాలను ప్రకటించిన తర్వాత తాను అసెంబ్లీలో అడిగితేనే



16వ మండల కేంద్రంగా అక్బర్‌పేట భూంపల్లిని మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తనను ఆశీర్వదించి తనను గెలిపించినట్లయితే అక్బర్‌పేట భూంపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు పదేళ్ల కాలంలో ఎంపి ప్రభాకర్‌రెడ్డి భూంపల్లికి రెండు ప్రభుత్వ కార్యాలయాలు కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ తన పదేళ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వకుండా క్వాటర్ సీసల దుకాణాలు మాత్రం అదనంగా తెరిపించాడని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీ వచ్చినప్పటికీ జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. కూడవెల్లి రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని మంచి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. రామాయంపేటకు ఆర్డీఓ ఆఫీస్ ప్రకటించినపుడు ఎంపి ప్రభాకర్‌రెడ్డి దుబ్బాకకు ఆర్డీఓ కార్యాలయం కావాలని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో అక్బర్‌పేట భూంపల్లి మండలాన్ని అన్నింటికంటే ముందు వరుసలో ఉంచుతానన్నారు. ముఖ్యమంత్రిని ఇస్తవా.. చస్తవా... అని అసెంబ్లీలో అడిగేది తానొక్కడినే అని అన్నారు. మునుగోడులో మూడు నెలలు,



హుజురాబాద్‌లో ఆరు నెలలు మద్యం తాగించి ప్రజల ఆరోగ్యం నాశనం చేసిన పార్టీ బిఆర్ఎస్ పార్టీయే అని, ఇక్కడ మాత్రం ప్రజలు చైతన్యవంతంగా ఉండి ఆరోగ్యాలను పాడు చేసుకోవద్దన్నారు. దుబ్బాక ప్రజల మీద ఈగ వాలినా ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. రోడ్డు వెడల్పులో భాగంగా అక్బర్‌పేట ప్రజల భూములు పోవద్దని ఢిల్లీలో కొట్లాడిన వ్యక్తి నేనే అన్నారు. 119 సీట్లలో ముదిరాజ్‌లకు ఒక్క సీటు ఇవ్వలేని పార్టీ బిఆర్ఎస్ పార్టీయే అన్నారు బీజేపిని గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రానికి బిసి ముఖ్యమంత్రిని చేస్తామన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ. 3100 మద్దతు ధర ప్రకటిస్తామన్నారు. కాంగ్రెస్ వారిని గెలిపిస్తే తిరిగి బిఆర్ఎస్‌లో కలుస్తారన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఓటేసే పరిస్థితే లేదన్నారు. మంత్రి హరీష్‌రావు దుబ్బాకపై సవతి తల్లి ప్రేమ చూపిస్తూ దుబ్బాకకు వచ్చే నిధులు సిద్దిపేటకు తరలించారన్నారు. కావున దుబ్బాక నియోజకవర్గ ప్రజలు ఆలోచించి నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అరిగె కృష్ణ, నాయకులు జలంధర్‌రెడ్డి, బిక్షపతి, కూతురు నర్సింలు, శ్రీకర్, గోత్రాల నరేష్‌తోపాటు ఆయా గ్రామాల బీజేపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ బిజేపిలు కవల పిల్లలే



మొదటి పేజీ తరువాయి..

లింగాయపల్లి తండా, గొడుగుపల్లి వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డాక గరీబోళ్ల బతుకులు గత్యంతరం లేకుండా పోయిందని, ఒకసారి దుబ్బాక ప్రజలే ఆలోచించి ముత్యంరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకువద్దామని, చేతి గుర్తుకు ఓటేసి నన్ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలను భూస్థాపితం చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుందని, గెలిచిన వెంటనే ఇచ్చిన మేనిఫెస్టోను ముందుకు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఉప ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిన మోసాలను ఎండగట్టే సమయం ఆసన్నమైందన్నారు. దుబ్బాక ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు పడాల రాములు, బండారు లాలు, దశరథరెడ్డి మాజీ ఎంపిటిసి స్వామి, రాజు, భద్రయ్య, వేణుగోపాల్, డాకొల్ల ఆంజనేయులు గౌడ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసే కేసీఆరా...అబద్ధాల కాంగ్రెస్సా

హుస్నాబాద్,నవంబర్ 25,(మనం న్యూస్)ః తెలంగాణను అభివృద్ధి చేసే కేసీఆర్ కావాలా..? అబద్ధాల కాంగ్రెస్ కావాలా..? కాంగ్రెస్ వస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అవుతది. ప్రజలు ఆలోచించి, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్‌తో కలసి శనివారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అలజడి లేకుండా సుభిక్షంగా, సంతోషంగా ఉందని, ఉమ్మడి రాష్ట్రంలో కొట్లాటలు, కల్లోలిత పరిస్థితులుండేవి అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు రాజకీయ వైరుధ్యం లేదని, స్నేహపూర్వక వాతావరణం ఉండేదని రాజకీయాలలో ప్రత్యర్థులుండాలి కానీ శత్రుత్వం ఉండవద్దని రాజకీయాలను ప్రజలకు సేవ చేయడానికి ఉపయోగించాలన్నారు. కొంతమంది ప్రతిపక్ష పార్టీ నాయకులు ఆలోచించాలని ఆయన హితవు పలికారు. కాంగ్రెస్, బిజేపి పార్టీలు తెలంగాణలో తమ గ్రాఫ్‌ను కోల్పోయాయి అన్నారు. తమ అంగబలం, అర్థబలంతో ఊహాజనితమైన, గ్లోబల్ ప్రచారాలను చేస్తూ ఈవెంట్ మేనేజ్‌మెంట్ లెక్క పోల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను నడుపుతున్నాయని తెలిపారు. జాతీయ పార్టీలని చెప్పుకునే ఆ పార్టీలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయి అని ఇప్పుడు తెలంగాణలో అభివృద్ధి చేస్తామని వస్తున్న ఆయా పార్టీలు వారు పాలించే రాష్ట్రాలలో ఈ పథకాలను ఎందుకు అమలు చేయడంలేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ కాదని, తెలంగాణను తెచ్చింది కేసీఆర్ అని ఆయన స్పష్టం చేసారు. గౌరవెల్లి ప్రాజెక్టు 1.14 టి.ఎమ్.సి.లతో కాంగ్రెస్ నిర్మాణం చేపడితే కేసీఆర్ సీఎం అయ్యాక 8.2 టి.ఎమ్.సి.లకు పెంచి ప్రాజెక్టును నిర్మించామని ఆయన తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రానికి 35 మెడికల్ కళాశాలను తీసుకువచ్చామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే 4 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకువచ్చామన్నారు. సంవత్సరానికి 10 వేల మంది డాక్టర్‌లను సమాజానికి అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గతంలో కరీంనగర్ ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న మెడికల్ కళాశాలను ఎందుకు తీసుకురాలేదో సమాధానం చెప్పాలన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెం.1 ఉందన్నారు. ఈ నెల 30 న జరిగే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో 80 సీట్లను మించి బీఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని, హుస్నాబాద్ నుండి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్ గెలవడం ఖాయమని ఆయన ఘంటాపథంగా చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీ లకావత్ మానస, నేషనల్ లెబర్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని, మండల అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

### నా జీవితం హుస్నాబాద్ ప్రజలకు అంకితం

### - హుస్నాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్

కరోనాతో ప్రాణపాయ స్థితిలోకి వెళ్ళినప్పటికి హుస్నాబాద్ ప్రజల ఆశీర్వాదంతో నే బ్రతికాను అని ఈ జీవితం హుస్నాబాద్ ప్రజల సేవకే అంకితమని హుస్నాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధికి అమడ దూరంలో ఉన్న మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్‌ను ఈ తొమ్మిదేన్నరేండ్లలో గణనీయంగా అభివృద్ధి చేసానని ఆయన తెలిపారు. త్రాగునీరు, సాగునీరు ఇబ్బందులను తొలగించామన్నారు. దేవాదుల మిడ్‌మానేరు నుండి నియోజకవర్గానికి సాగునీరు అందిస్తున్నామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో 17 చెక్‌డ్యామ్‌లు నిర్మించామన్నారు. 16 విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ప్రభుత్వ ఆసుపత్రి, డయాలసిస్ సెంటర్, మాతా శిశు కేంద్రం, మరెన్నో హుస్నాబాద్‌కు తీసుకువచ్చామన్నారు. ప్రజలు మరోసారి నన్ను ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటేసి నన్ను గెలిపించాలన్నారు.







# హరీష్‌రావు..... దేడ్‌లాఖ్

చిన్నకోడూరు, నవంబర్ 25, మనం న్యూస్ః మండల పరిధి మైలారం గ్రామానికి చెందిన బీజేపి ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి బిఆర్ఎస్‌లో చేరారు. అల్లీపూర్ గ్రామానికి చెందిన యువకులు మహంకాళి మహేష్, ఆంకార్ ప్రవీణ్‌లు యూత్ అధ్యక్షులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపిపి మాణిక్యరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి కారు పార్టీలోకి ఆహ్వానించారు. నవంబర్ 30న జరగబోయే ఎన్నికల్లో హరీష్‌రావుకు లక్షా యాభై వేల మెజార్టీ అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపి ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయి తప్ప ప్రజా సంక్షేమం గురించి పాటుపడడం లేదని, ప్రజా శ్రేయస్సు కాంక్షించే పార్టీ బిఆర్ఎస్ అన్నారు. ఈ కార్యక్రమంలో కీసరి పాపయ్య, డిసిసిబి జిల్లా డైరెక్టర్ రామచంద్రం, సీనియర్ నాయకులు కొండం రవిందర్‌రెడ్డి, హన్మయ్య,







కుమార్, దేవేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పిల్లి నవీన్, మహంకాళి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

**-చిన్నకోడూరు/సిద్దిపేటలో....**

ప్రజల వెన్నంటే ఉండి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న హరీష్‌రావుకు చూపిస్తున్న అభిమానంతో ఈ ఎన్నికల్లో దేడ్‌లాఖ్ మెజార్టీ పక్కా అని మంత్రి హరీష్‌రావు సతీమణి శ్రీనిత అన్నారు. శనివారం చిన్నకోడూరు మండల కేంద్రంతోపాటు, సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో ఛైర్మన్, కౌన్సిలర్లతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి వచ్చిన శ్రీనితకు మహిళలు మంగళహారతులతో పూల వర్షాలతో ఘనస్వాగతం పలికారు. ప్రజలతో మమేకమై ప్రజల కష్టసుఖాలు పంచుకుంటూ బిఆర్ఎస్ అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ హరీష్‌రావుకు ఓటేయాలని కోరారు. బిఆర్ఎస్ ఇంటి పార్టీ అని, మిగతా పార్టీలన్నీ ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్నాయని, మన పార్టీని మనం గెలిపించుకుంటే పనులన్నీ త్వరగా అయిపోతాయన్నారు. బిఆర్ఎస్ గెలిస్తే సీఎం కేసీఆర్ ఒక్కడేనని, ప్రతిపక్షాలు గెలిస్తే సీఎం ఎవరో నిర్ణయించే సరికి ఐదేళ్ల కాలం పోతుందన్నారు. తాను వ్యాపార నిమిత్తం అన్ని నగరాల్లో పర్యటించినట్లు, అప్పుడు తెలంగాణ పేరు చెప్తే ఎవరూ గుర్తుపట్టేవారు కాదని, నేడు తెలంగాణ పేరు ప్రపంచవ్యాప్తంగా గుర్తిస్తున్నారన్నారు.

**-హరీష్‌రావుకు అసోసియేషన్‌ల మద్ధతు**

మంత్రి హరీష్‌రావుకు పలు అసోసియేషన్‌లు శనివారం మద్ధతు తెలిపాయి. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమాన్ని అందిస్తూ బాగోగులు చూస్తున్న హరీష్‌రావుకు తామంతా మద్ధతుంటామని భరోసానిచ్చారు.







**-మెజార్టీ రావాలని కోరుతూ పాదయాత్ర**

సిద్దిపేట పట్టణానికి చెందిన అంతగిరి కిరణ్, నాగరాజులు హరీష్‌రావుకు ఈ ఎన్నికల్లో లక్షా యాభై వేల మెజార్టీ రావాలని కోరుతూ మోహిన్‌పుర వెంకటేశ్వర స్వామి దేవాలయం నుండి వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజనర్సు సంఘీభావం తెలుపుతూ వారిని అభినందించారు.

**-పలువురు బిఆర్ఎస్‌లో చేరిక**

25వ వార్డుకు చెందిన సుంకోజి హరీష్‌చారి 20 మంది యువతతో కలిసి మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజనర్సు ఆద్వర్యంలో హరీష్‌రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చేరిన వారందరికీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**-ఏకగ్రీవం తెలిపిన హనుమంతుపల్లి గ్రామం**



సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు మదిర గ్రామం హనుమంత్‌పల్లిలో బిఆర్ఎస్‌కు మద్ధతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సుడా ఛైర్మన్ మారెడ్డి రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ 24 గంటలు నియోజకవర్గ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా మంత్రి హరీష్‌రావు పని చేస్తున్నాడని, ఎన్నికలప్పుడే వచ్చే రాజకీయ చుట్టాలకు ఓటు వేసి ఓటును వృధా చేసుకోవద్దన్నారు. అనేక అభివృద్ధి పనులను గ్రామంలో చేసుకున్నామని, మరిన్ని అభివృద్ధి పనులు కావాలన్నా హరీష్‌రావుకు అందరూ ఓటు వేయాలన్నారు. వార్డు కౌన్సిలర్‌గా గెలవలేని అభ్యర్థులు సిద్దిపేట బరిలో ఉన్నారని, వారు జనాల్లో ముఖ పరిచయం కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి శ్రీహరి గౌడ్, వైస్ ఎంపిపి యాదగిరి, ఎంపిటిసి బాబు, ఉప సర్పంచ్ స్వామి, వార్డు సభ్యులు శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షులు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

